
సమాజం యొక్క నాడి
# ఏక్ దం న్యూస్
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదివారం 22 మార్చి 2026 | పేజీలు 06 | ఉమ్మడి కరీంనగర్



## వేములవాడ పట్టణ సుందరీకరణే లక్ష్యం





3లో

- రూ. 46 లక్షలతో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు
- రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- 50 ఏళ్ల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం

## శంకరపట్నం అంబేద్కర్ చౌరస్తా వద్ద ఘోరం



2లో

- మూడేళ్ల చిన్నారి దుర్మరణం
- లారీ రూపంలో వచ్చిన మృత్యువు..
- కళ్లెదుటే బిడ్డ మృతి చెందడంతో తల్లి తల్లడిల్లిపోయిన వైనం

## భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- ఈద్గాల వద్ద ముస్లింల సామూహిక ప్రార్థనలు
- ఆలింగనం చేసుకుని 'ఈద్ ముబారక్' శుభాకాంక్షలు
- శాంతి, సౌభ్రాతృత్వం వర్ధిల్లాలని ఆకాంక్ష



2లో

## పేదలకు వరం.. జన ఔషధి కేంద్రం



3లో



- చౌక ధరకే నాణ్యమైన మందులు: కేంద్రమంత్రి బండి సంజయ్
- ముకరంపుర డాక్టర్ స్ట్రీట్‌లో జన ఔషధి కేంద్రం ప్రారంభం
- ఆయుష్మాన్ భారత్‌తో సామాన్యులకు వైద్య భరోసా

## శంకరపట్నంలో కరీంనగర్ మేయర్‌కు ఘన స్వాగతం

### బిజెపి నాయకుల సన్మానం



**ఏక్‌దం న్యూస్, శంకరపట్నం:**
కరీంనగర్ నగర మేయర్ వై. సునీల్ రావు (కొలగాని శ్రీనివాస్ రావు) శనివారం శంకరపట్నం మండలానికి మొదటిసారి విచ్చేసిన సందర్భంగా బిజెపి శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి. బిజెపి మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మేయర్‌ను శాలువాతో కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేయర్‌తో పాటు కరీంనగర్ కార్పొరేటర్లు సోమిడి వేణు, ఎన్నం ప్రకాష్ కూడా పాల్గొన్నారు. మేయర్ రాకతో స్థానిక రాజకీయాల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సన్మాన కార్యక్రమంలో బిజెపి నాయకులు కటకం లోకేష్, రాసమల్ల శ్రీనివాస్, బిజిలి సారయ్య, బొజ్జ సాయి ప్రకాష్, గూళ్ళ రాజు, తోట అరవింద్, కూనారపు శ్రీనాథ్, కారంకంటి కుమార్ మరియు పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

# శంకరపట్నం అంబేద్కర్ చౌరస్తా వద్ద ఘోరం



- మూడేళ్ల చిన్నారి దుర్మరణం
- లారీ రూపంలో వచ్చిన మృత్యువు..
- కళ్లెదుటే బిడ్డ మృతి చెందడంతో తల్లి తల్లడిల్లిపోయిన వైనం

**ఏక్‌దం న్యూస్, శంకరపట్నం:**
మండల కేంద్రంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం ఒక నిరుపేద కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. అతివేగంగా వచ్చిన లారీ రూపంలో మృత్యువు ఓ చిన్నారి ప్రాణాలను బలితీసుకుంది. కన్నబిడ్డ కళ్లెదుటే లారీ చక్రాల కింద ఛిద్రమై విగతజీవిగా పడి ఉండటం చూసి ఆ తల్లి గుండెలు అవిసేలా రోదించిన తీరు స్థానికులను కన్నీరు పెట్టించింది.

**ప్రమాదం జరిగిందిలా..**
మహారాష్ట్రకు చెందిన చావన్ శ్రావణ్ – పుష్పమాల దంపతులు ఉపాధి నిమిత్తం వచ్చి గత 20 ఏళ్లుగా శంకరపట్నంలో రోడ్డు పక్కనే నివాసముంటున్నారు. వీరికి నలుగురు సంతానం. శనివారం మధ్యాహ్నం వీరి చిన్న కుమార్తె నిత్య (3) రోడ్డు పక్కన ఆడుకుంటుండగా, వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఒక లారీ చిన్నారిని బలంగా ఢీకొట్టింది. లారీ చక్రాలు చిన్నారిపై నుంచి వెళ్లడంతో నిత్య అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ వాహనంతో సహా అక్కడి నుండి పరారయ్యాడు.

**పోలీసుల దర్యాప్తు:**
సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా పరారైన లారీని గుర్తించే పనిలో పడ్డారు. అభం శుభం తెలియని చిన్నారి మృతితో మండల కేంద్రంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు



**ఏక్‌దం న్యూస్, కరీంనగర్:**
పవిత్ర రంజాన్ పండుగ వేడుకలను శనివారం జిల్లావ్యాప్తంగా ముస్లింలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు ముగించుకుని, ఈద్–ఉల్–ఫితర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈద్గాల వద్ద ప్రత్యేక సామూహిక ప్రార్థనలు చేశారు. నూతన వస్త్రాలు ధరించి చిన్నా పెద్దా తేడా లేకుండా ఈద్గాలకు తరలివచ్చి అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

నమాజ్.. ఆలింగనం:

నగరంలోని ప్రధాన ఈద్గాల వద్ద మత పెద్దల ఆధ్వర్యంలో సామూహిక నమాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువులు దివ్య ఖురాన్ వాక్కులను భక్తులకు ఉపదేశించారు. దేవుని కృప పొందడానికి పాటించవలసిన నియమాలు, దానధర్మాల ప్రాధాన్యతను వివరించారు. నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని 'ఈద్ ముబారక్' అంటూ ఆప్యాయంగా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం మరియు ఐక్యత మరింత బలపడాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

సోదరభావానికి ప్రతీక:

హిందూ ముస్లిం సోదరభావానికి ప్రతీకగా సాగిన ఈ వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఈద్గాల వద్దకు చేరుకుని ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ సందర్భంగా ముస్లిం ఇళ్లలో ప్రత్యేకంగా తయారు చేసిన 'షీర్ ఖుర్మా'ను స్నేహితులకు, బంధువులకు పంచిపెట్టి పండుగ సంతోషాన్ని పంచుకున్నారు. ప్రార్థనల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

## యాదవ సంఘం అధ్యక్షుడిగా ముత్యాల మల్లేష్



- పూర్తిస్థాయి కమిటీ ఎన్నిక పట్ల యాదవుల హర్షం
- సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలని పిలుపు

**ఏక్‌దం న్యూస్, సైదాపూర్:**
యాదవ సంఘం సైదాపూర్ మండల కమిటీని శనివారం పూర్తిస్థాయిలో ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన యాదవ సంఘం సమావేశంలో పెరుకపల్లి గ్రామానికి చెందిన ముత్యాల మల్లేష్ యాదవ్‌ను ఏకగ్రీవంగా మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు నాయకులు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

**నూతన కార్యవర్గం వివరాలు:**
మండల ఉపాధ్యక్షులుగా ఆసరి రాజు, దుమ్మాల కొమురయ్య, సహాయ కార్యదర్శులుగా భాషవేని కిరణ్, బండి రమేష్, కోశాధికారిగా మాదం స్వామి ఎన్నికయ్యారు. సలహాదారులుగా మండల కొమురయ్య, భాషబోయిన రవీందర్, కార్యవర్గ సభ్యులుగా నలువల రాజు, బావు రాజయ్య, కాశవేణి రవీందర్, పిల్లి కొమురయ్యలను నియమించినట్లు తెలిపారు.

**హక్కుల సాధనే లక్ష్యం:**
ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ముత్యాల మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి బావు తిరుపతి మాట్లాడుతూ.. యాదవుల సమస్యల పరిష్కారం, సంఘం అభివృద్ధి మరియు హక్కుల సాధన కోసం నిరంతరం పాటుపడతామని స్పష్టం చేశారు. యాదవులు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో రాణించాలని వారు పిలుపునిచ్చారు. మండల కమిటీని పూర్తిస్థాయిలో ప్రకటించడం పట్ల మండలంలోని యాదవ సోదరులు హర్షం వ్యక్తం చేస్తూ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

# వేములవాడ పట్టణ సుందరీకరణే లక్ష్యం





- రూ. 46 లక్షలతో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు
- రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- 50 ఏళ్ల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**ఏక్‌దం న్యూస్, వేములవాడ:**
దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న క్షేత్రాన్ని మరియు పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని బ్రిడ్జి నుండి ఆలయం వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ క్రమంలో సుమారు రూ. 46 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాల పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.

**శరవేగంగా రోడ్డు విస్తరణ:**
ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. వేములవాడ పట్టణ ప్రజల 50 ఏళ్ల నాటి చిరకాల కోరిక అయిన రోడ్డు వెడల్పు పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. రోడ్డు విస్తరణ నేపథ్యంలో గతంలో రోడ్డు మధ్యలో ఉన్న పాత విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో అత్యాధునికమైన నూతన స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దీనివల్ల భవిష్యత్తులో విద్యుత్ లైన్ల నిర్వహణ సులభతరం కావడమే కాకుండా పట్టణ సుందరీకరణ పెరుగుతుందని అన్నారు.

**త్వరితగతిన పూర్తి చేస్తాం:**
భక్తులకు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన రోడ్డు వెడల్పు పనులను పూర్తి చేస్తామని విప్ హామీ ఇచ్చారు. ఆలయ పరిసరాల్లో అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అరకొర బడ్జెట్‌తో విద్యాశాఖ బలోపేతం అసాధ్యం

## పెంట అంజయ్య



**ఏక్‌దం న్యూస్, హైదరాబాద్:**
తెలంగాణ ప్రభుత్వం 2026–27 బడ్జెట్‌లో విద్యాశాఖకు కేవలం 8.22% (26,674 కోట్లు) నిధులు మాత్రమే కేటాయించడంపై ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంట అంజయ్య తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఇది కేవలం 0.62% పెరుగుదల మాత్రమేనని, విద్యా కమిషన్ సూచించిన 18% నిధుల ప్రతిపాదనను ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అల్పాహారం, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ వంటి కొత్త పథకాలు తీసుకువస్తున్న తరుణంలో ఈ నిధులు ఏమాత్రం సరిపోవని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగాలంటే మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. కనీసం 15% బడ్జెట్ కేటాయించకుండా విద్యాశాఖను ఎలా బలోపేతం చేస్తారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

# పేదలకు వరం.. జన ఔషధి కేంద్రం





- చౌక ధరకే నాణ్యమైన మందులు: కేంద్రమంత్రి బండి సంజయ్
- ముకరంపుర డాక్టర్ స్ట్రీట్‌లో జన ఔషధి కేంద్రం ప్రారంభం
- ఆయుష్మాన్ భారత్‌తో సామాన్యులకు వైద్య భరోసా

ఏక్‌దం న్యూస్, కరీంనగర్: సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్యం, తక్కువ ధరకే మందులు అందించడమే లక్ష్యంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శనివారం కరీంనగర్‌లోని ముకరంపుర డాక్టర్ స్ట్రీట్‌లో ఏర్పాటు చేసిన 'ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాన్ని' ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ లభించే మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**భారం తగ్గించేందుకే ఈ కేంద్రాలు:**
ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ మెడికల్ షాపుల్లో మందుల ధరలు సామాన్యులకు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. మందులు కొనే స్తోమత లేక ఎంతో మంది పేదలు ఇబ్బందులు పడుతున్నారని, వారి కష్టాలను గుర్తించి ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా జన ఔషధి కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. బ్రాండెడ్ మందులతో సమానమైన నాణ్యత కలిగిన జనరిక్ మందులను ఇక్కడ అత్యంత చౌక ధరలకే అందిస్తున్నట్లు వివరించారు.

**ఆరోగ్య సేవలు అందరికీ చేరాలి:**
ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నామని, దానికి తోడు ఈ జన ఔషధి కేంద్రాలు మందుల ఖర్చును గణనీయంగా తగ్గిస్తాయని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం చౌక ధరలకే మందులు లభించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, కరీంనగర్ ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. జనరిక్ మందుల వాడకంపై ప్రజల్లో అవగాహన పెరగాలని, తద్వారా సామాన్యుల ఆర్థిక భారం తగ్గుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, వైద్య రంగ ప్రముఖులు పాల్గొన్నారు.